సాక్షి నిజామాబాద్

సోమవారం । 26 । మే । 2025



విద్యార్థులు మంచి ..

విద్యార్థులు మంచి నడవడికను అలవరుచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు.

-8లో ▸



మేత కోసం..

బాతుల పెంపకం కోసం ఏపీలోని చిత్తూరుకు చెందిన రెండు కుటుంబాలు నెలరోజుల క్రితం జిల్లాకు వచ్చాయి.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.5 /23.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ జల్లులు కురిసే అవకాశాలున్నాయి. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హోటల్‌లో అగ్ని ప్రమాదం



ఖలీల్‌వాడి: నగరంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న సాయిమెస్ టిఫిన్ సెంటర్‌లో ఆదివారం ఉదయం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. టిఫిన్ సెంటర్ కిచెన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించడంతో ఘటనాస్థలానికి చేరుకున్న ఫైరింజన్లు మంటలార్పాయి. ఘటన సమయంలో టిఫిన్ సెంటర్‌లో కస్టమర్లు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే పక్కనే ఉన్న టిఫిన్ సెంటర్‌ను మూసివేయడంతోపాటు పైఅంతస్తులోని మెస్, లాడ్జీలో ఉన్న వారిని ఖాళీ చేయించారు.

ప్రశాంతంగా జీపీవోల రాత పరీక్ష

నిజామాబాద్‌అర్బన్: గ్రామ పాలన అధికారుల(జీపీవో) రాత పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష కొనసాగింది. జిల్లాలో మొత్తం 332 మంది అభ్యర్థులకు గాను 302 మంది హాజరుకాగా, 30 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం.. ఇంటర్ విద్యార్థినికి నష్టం

- పరీక్ష ఫీజు చెల్లించకపోవడంతో రాని హాల్‌టికెట్

నిజామాబాద్ అర్బన్ : మోడల్ స్కూల్ అధికారుల నిర్లక్ష్యంతో ఓ విద్యార్థిని ఏడాది విద్యా సంవత్సరాన్ని కోల్పోయింది. మాక్లూర్ మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన వర్ష నవీపేట మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంటర్‌లో గణితం సబ్జెక్టుకు సంబంధించిన సప్లిమెంటరీ ఫీజును చెల్లించింది. కానీ, మోడల్ స్కూల్ అధికారులు ఆ ఫీజును బోర్డుకు చెల్లించలేదు. దీంతో పరీక్షలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థినికి హాల్‌టికెట్ రాలేదు. ఇదే విషయాన్ని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాస్‌ను ప్రశ్నించగా పొరపాటు జరిగిందని, అధికారులను కలిసి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కానీ, వర్ష ఈ ఏడాది పరీక్షలు రాసే అవకాశం కోల్పోయింది. అధికారుల నిర్లక్ష్యంతో తమ కూతురు ఏడాది విద్యా సంవత్సరం నష్టపోయిందని, తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ విషయమై డీఈవో అశోక్‌ను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని, పరిశీలిస్తామని తెలిపారు.

ముందుకెళ్లాలా? వద్దా?

ముందస్తు వర్షాలు అన్నదాతను ముందుకు వెళ్లాలా? వద్దా? అనే సందిగ్ధంలో పడేశాయి. సాగు పనులు ప్రారంభించిన తరువాత వర్షాలు ముఖం చాటేస్తే తమ పరిస్థితి ఏమిటనే ఆలోచనలో రైతులు ఉన్నారు. మరోవైపు వాతావరణశాఖ మాత్రం జూన్ 1కి ముందే రుతుపవనాలు వస్తాయని ప్రకటిస్తోంది. అటూ ఇటుగా మరో ఐదురోజుల్లో వానలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ముందస్తు వర్షాలు కొంతమంది రైతులకు మేలు చేస్తుండగా, మరికొంత మంది రైతులకు నష్టాన్ని మిగులుస్తున్నాయి. పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు, బస్తాలు తడుస్తున్నాయి. టమాటా, కొత్తిమీర, ఇతర కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. ఇలా ఉండగా జిల్లాలోని పలుచోట్ల రైతులు పసుపు సాగు పనులను ప్రారంభించారు.



మొక్కజొన్న పంట మడిలో నిలిచిన నీరు

- ముందస్తు వానలతో అన్నదాతల్లో అయోమయం
- కోతలు పూర్తికాని పంటలపై ప్రభావం
- జూన్ 1కి ముందే రుతు పవనాల రాక
- పంటల సాగుపై నెలకొన్న సందిగ్ధత
- వేచి చూడాలంటున్న వ్యవసాయ అధికారులు

ఇందల్వాయి : ద్రోణి ప్రభావంతో ముందస్తుగా కురుస్తున్న వర్షాలు రైతులను సందిగ్ధంలో పడేశాయి. ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారం తర్వాత వర్షాలు కురిసేవి. కానీ, ఈసారి మే నెలలోనే వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతల్లో అయోమయం నెలకొంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంట దిగుబడులను విక్రయించేసుకున్న రైతులకు మేలు చేస్తుండగా, మిగతా వారికి నష్టాన్ని మిగులుస్తున్నాయి! ఇదిలా ఉండగా నైరుతి రుతుపవనాలు ఈసారి ముందుగానే పలుకరించనున్నాయనే సమాచారంతో ఖరీఫ్ సాగుపై రైతుల్లో అయోమయం నెలకొంది.

ప్రయోజనాలు ఇవే..

ముందస్తు వానలతో రైతులకు ప్రయోజనాలూ ఉన్నాయి. ఇప్పటికే అలికిన పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, పెద్ద జనుము పంటలు ఏపుగా వేగంగా ఎదుగుతాయి. విత్తనం పసుపులో మొలక శాతం పెరిగే అవకాశం ఉంది. ఉద్యాన పంటలకు ఈ వర్షాలు మేలు చేస్తాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. సేంద్రియ ఎరువులు చల్లుకొని కలియదున్నడానికి ఈ వాతావరణం అనుకూలం.

లక్ష్యానికి మించి సాగయ్యే అవకాశం

వర్షాలు సమృద్ధిగా కురుస్తుండడంతో జిల్లాలో ఈసారి లక్ష్యానికి మించి పంటలు సాగయ్యే అవకాశం ఉంది. జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో 5,21,309 ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందులో 4.32 లక్షల ఎకరాల్లో వరి, 47 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 37 వేల ఎకరాల్లో సోయాబీన్, మరో ఐదు వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయని అధికారులు తెలిపారు. పంటల సాగుకు అనుగుణంగా ఎరువులను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

నష్టాలు ఇవే..

మే నెలలో కురిసిన వర్షాలు చాలా మంది రైతులను నష్టాలపాలు చేశాయి. చెరువుల కింద సాగు చేసిన వరి కోతలు, మరికొన్ని చోట్ల ధాన్యం కొనుగోళ్లు పూర్తికాలేదు. లోతు దుక్కులు చేసే అవకాశం లేదు. దుక్కులు ఎండకపోవడంతో చీడపీడలు, శిలీంద్రాలు భూమిలో అలాగే ఉండి వానాకాలం పంటలకు నష్టం కలిగించే అవకాశం ఉంది. మేలో చేతికొచ్చే నువ్వులు, సజ్జ పంటలు వర్షానికి తడిసి దిగుబడులు అమాంతం తగ్గిపోయాయి.

రంగు మారి ధరలు పడిపోయాయి. టమాటా, కొత్తిమీర, ఇతర కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. ఇప్పటికే సాగు చేసిన బుట్టమక్కతోపాటు అంకురం దశలో ఉన్న చిక్కుడు, మిరప, వంకాయ, బెండ వంటి కూరగాయల క్షేత్రాల్లో నీరు నిలిచి మొక్కలు చనిపోతున్నాయని, ఉన్న మొక్కల్లో ఎదుగుదలలేదని రైతులు వాపోతున్నారు.

సజ్జ రైతును ముంచిన వాన



మొలకెత్తిన సజ్జ కంకులు

బాల్కొండ: అకాల వర్షాలు సజ్జ రైతును నిండా ముంచాయి. వరుసగా కురిసిన వర్షాలతో కోసిన సజ్జతోపాటు మొక్కలపైనే సజ్జ కంకులకు మొలకలు వచ్చాయి. దీంతో మొలకెత్తిన సజ్జ పంటను కొనుగోలు చేయబోమని సీడ్ వ్యాపారులు తేల్చిచెపుతున్నారు. ఆర్మూర్ డివిజన్‌లో సుమారు 30 వేల ఎకరాల వరకు రైతులు సజ్జ సాగు చేశారు. 50 శాతం మేర కోతలు పూర్తికాగా, మిగతా పంటలపై వర్షం ప్రభావం పడింది. దీంతో ఒక్కో రైతు ఎకరానికి సుమారు రూ.లక్ష నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. తడిసి మొలకెత్తిన సజ్జ పంటను రైతులు పశువుల దాణా మార్కెట్‌లో క్వింటాల్ రూ.వెయ్యికి విక్రయించుకోవాల్సిన దుస్థితి వచ్చింది.

“ ఎకరానికి రూ.లక్ష నష్టపోతున్నాం



వర్షాలతో తడిసి మొలకెత్తిన సజ్జ పంటను వ్యాపారులు కొనుగోలు చేయబోమని తేల్చిచెప్పారు. ఆరు రోజులుగా రెక్కలు ముక్కలు చేసుకొని ఆరబెడుతున్నా ఫలితం లేకుండా పోయింది. ఎకరానికి రూ.లక్ష నష్టపోతున్నాం. ప్రభుత్వం సజ్జ రైతులను ఆదుకోవాలి. – జంగం గంగాధర్, రైతు, రెంజర్ల



అధిక వర్షాల కారణంగా దెబ్బతిన్న కూరగాయల మొక్కలు

ఈ స్థాయి వర్షాలు ఎన్నడూ చూడలేదు

గతంలో ఎన్నడూ మే నెలలో ఈస్థాయి వర్షాలు కురవడం చూడలేదు. చాలా మంది రైతులు వేసవి దుక్కులు కూడా చేసుకోలేదు. దున్నిన దుక్కులు కూడా పూర్తిస్థాయిలో ఎండలేదు. కూరగాయలు, నువ్వు పంటలతో తీవ్రంగా నష్టపోయాం. ముందస్తు వర్షాలతో పంటలు సాగు మొదలుపెట్టాలా? వద్దా? అనే అయోమయంలో ఉన్నాం. – దేంబాల్ గంగారెడ్డి, రైతు, నల్లవెల్లి

“ రైతులు తొందరపడొద్దు

పసుపు, మొక్కజొన్న పంటల సాగు ఇప్పుడు చేపట్టొచ్చు. జూన్ మూడు, నాలుగో వారాల్లో సోయాబీన్ విత్తుకోవడానికి అనుకూలం. వరిలో దీర్ఘకాలిక రకాలు, సన్నరకాలు సాగు చేసుకునే రైతులు జూన్ మొదటి వారంలో నారు పోసుకుంటే మంచిది. రైతులు తొందరపడకుండా పంటల సాగులో సందేహాలు, మెళకువలకు వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

– వీరాస్వామి, జిల్లా వ్యవసాయ అధికారి

8.4 మిల్లీమీటర్ల వర్షం



నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ఆదివారం 8.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా రుద్రూరులో 32, నవీపేటలో 21.6 , బోధన్‌లో 19 , నందిపేటలో 13, ఎడపల్లిలో 11, రెంజల్‌లో 14, కోటగిరిలో 13 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు తెలిపారు. పలు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది.



నల్లవెల్లిలో తడిసిన నువ్వు

పసుపు సాగు షురూ

- వర్షాలు కురవడంతో విత్తనాలు విత్తుతున్న రైతులు
- ఈ ఏడాది 25వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశం

డొంకేశ్వర్(ఆర్మూర్): వర్షాలు కురుస్తుండడంతో జిల్లాలో పసుపు సాగు పనులు మొదలయ్యాయి. రైతులు సహజ ఎరువులతో సిద్ధం చేసుకున్న భూముల్లో విత్తనాలు విత్తడం ప్రారంభించారు. పంట దిగుబడికి మార్కెట్‌లో పర్వాలేదనే స్థాయిలో ధర రావడంతో ఈ ఏడాది కూడా పసుపు సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గతేడాది 23వేల ఎకరాల్లో పసుపు సాగు కాగా, ఈసారి 25వేల ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉన్నట్లు ఉద్యాన శాఖ అంచనా వేస్తోంది. మృగశిర కార్తె తర్వాత జిల్లా అంతటా పసుపు సాగు పనులు ఊపందుకునే అవకాశాలు ఉన్నాయి.

మక్క, సోయా కూడా...

మరోవైపు మొక్కజొన్న, సోయా సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. విత్తనాలు విత్తేందుకు కూలీలను ముందుగానే మాట్లాడుకుంటున్నారు. సొసైటీల నుంచి యూరియా, ఇతర ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో మక్క 47,678 ఎకరాల్లో, సోయా 37,859 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది.



డొంకేశ్వర్‌లో పసుపు విత్తుతున్న రైతులు

“ రెండున్నర ఎకరాల్లో పసుపు వేశా



పోయిన సారి 3.25 ఎకరాల్లో సాగు చేసిన పసుపును సాంగ్లి మార్కెట్‌లో విక్రయిస్తే రూ.13వేల నుంచి రూ.15వేల వరకు ధర వచ్చింది. ఇప్పుడు మళ్లీ రెండున్నర ఎకరాల్లో విత్తనాలు వేశాను. ఇందుకు సొంతంగానే ఎర్ర గుంటూరు విత్తనాన్ని తయారు చేశాను. – రాహుల్‌రెడ్డి, డొంకేశ్వర్

పచ్చని కాపురాల్లో వివాహేతర చిచ్చు

- ఈ నెల 5న మాక్లూర్ మండలంలోని కల్లెడ తండాలో గుగులోత్ శంకర్ డాబా పైనుంచి పడి మృతి చెందాడని భార్య యమున నమ్మించింది. తండ్రి మృతిపై అనుమానంతో కుమారుడు గుగులోత్ రమేశ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో అసలు విషయం బయటికొచ్చింది. భార్య యమునను పోలీసులు విచారించగా ప్రియుడు నందుతో కలిసి శంకర్‌ను కర్రతో కొట్టి, గొంతు నులిమి హత్య చేసినట్లు తెలిపారు.



- వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉందని ఆర్మూర్ పట్టణంలోని పెద్దబజారులో నివాసం ఉంటున్న అంజలిని భర్త గంగారెడ్డి ఈ నెల 19న ఇద్దరు పిల్లల ఎదుటే దారుణంగా హత్య చేశాడు. దుబాయ్‌లో ఉంటున్న గంగారెడ్డి ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళతో కొన్ని సంవత్సరాలుగా వివాహేతర బంధం కొనసాగిస్తున్నాడని భార్యకు తెలిసింది. దీంతో గొడవ ముదిరి విడాకుల వరకు వెళ్లగా.. కోర్టులో కేసు నడుస్తుండగానే అంజలిని హతమార్చాడు.

ఖలీల్‌వాడి : రెండు మనసులు.. మూడు ముళ్లు.. ఏడు అడుగులతో ముడిపడిందే భార్యాభర్తల బంధం. జీవితాంతం ప్రేమ, ఆప్యాయతలతోపాటు కష్టసుఖాలు, కుటుంబ బాధ్యతలను మోసుకుంటూ ముందుకు సాగేదే సంసారం. ఈ పవిత్ర బంధం.. మనస్పర్థలు, అనుమానాలు, కుటుంబ కలహాలతో విచ్ఛిన్నమవుతోంది. చిన్నపాటి మనస్పర్థల కారణంగా పరాయి వ్యక్తులతో చనువు పెరిగి, సాన్నిహిత్యం ఏర్పడుతోంది. అదే వివాహేతర సంబంధాలకు దారి తీస్తోంది. పచ్చని కాపురాల్లో చిచ్చు రేపుతున్నాయి. ఈ క్రమంలో కొందరు తమ జీవిత భాగస్వామిని అడ్డుతొలగించుకోడానికీ వెనుకాడడం లేదు. దీంతో కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయి. ఇటీవల జిల్లాలో చోటు చేసుకున్న

- భార్యాభర్తల మధ్య మనస్పర్థలు
- సోషల్ మీడియాలో పరిచయాలు
- జీవిత భాగస్వాములను వదిలించుకునేందుకు అఘాయిత్యం
- రోడ్డున పడుతున్న కుటుంబాలు

వరుస ఘటనలు ఆందోళనకు గురిచేస్తున్నాయి.

కుటుంబాలు ఛిన్నాభిన్నం..

వివాహేతర సంబంధాలతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు పెరిగి అఘాయిత్యాలకు దారి తీస్తున్నాయి. భార్య లేదా భర్త జైలుకు వెళితే బెయిలు ఇప్పించేందుకు కూడా ఎవరూ ముందుకు రారు. దీంతో తల్లిదండ్రులు ఉన్నా పిల్లలు అనాథలుగా మారుతారు. వివాహేతర సంబంధంతో ఎలాంటి ఘటన జరిగినా వారి కుటుంబసభ్యులు ఆ ప్రాంతంలో తలెత్తుకొని తిరిగే పరిస్థితి ఉండదు.

“ కౌన్సెలింగ్ అవసరం

భార్యాభర్తలకు మనస్పర్థలు వచ్చినప్పుడు పోలీసులు లేదా ఫ్యామిలీ కౌన్సెలర్ల వద్ద కౌన్సెలింగ్ తీసుకోవాలి. దీంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు తొలిగిపోతాయి. ఇలాంటి ఘటనలు పెళ్లి అయిన 20 ఏళ్ల తర్వాత జరుగుతున్నట్లు గుర్తించాం. ఇరువురి మధ్య గొడవలు హత్యలకు దారితీస్తున్నాయి. దీంతో కుటుంబం రోడ్డున పడుతుంది.

– రాజావెంకటరెడ్డి, ఏసీపీ, నిజామాబాద్

కారణాలు ఇవే..

- పని ఒత్తిడితో జీవిత భాగస్వామికి సరైన సమయం కేటాయించకపోవడంతో ఇద్దరి మధ్య గ్యాప్ ఏర్పడుతుంది.
- చిన్న, చిన్న సమస్యలపై ఒకరిపై ఒకరికి కోపతాపాలు వస్తాయి. అదే సమయంలో తమతో చనువుగా మాట్లాడే వారి వైపు ఆకర్షితులవుతున్నారు.
- జీవిత భాగస్వాములు తాము చెప్పినట్లు వినడం లేదంటూ దారితప్పుతున్నారు.
- స్మార్ట్ ఫోన్‌లు రావడంతో సోషల్ మీడియా ప్రభావం కుటుంబాలపై పడింది. అందులోని పరిచయాలు నెమ్మదిగా వివాహేతర సంబంధాలకు దారితీస్తున్నాయి. దీంతో కుటుంబంలో చిచ్చు రేగుతోంది.
- ఇతరులతో ఫోన్‌లో మాట్లాడితే చాలు భాగస్వాముల మధ్య మనస్పర్థలు వస్తున్నాయి. ఇరువురి మధ్య అనుమానాలు పెరిగి గొడవలకు దారితీస్తుంది. చివరికి అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు.

ప్రకృతి ప్రేమికుల విందు



జొన్నపంటవ్యర్థాలతో తయారుచేసిన గ్లాసులు

సేంద్రియపద్ధతిలో సాగుచేసి వండిన వంటకాలు

సహజ రంగులతో సైన్ వస్త్రంపై ఆహ్వానం..

నిజామాబాద్ రూరల్ : రావి ఆకులపై ఆహ్వానపత్రిక.. అతిథులకు స్వాగతం పలుకుతూ ఫంక్షన్ హాల్ బయట సహజ రంగుతో బట్టపై రూపొందించిన ‘ప్రత్యేక ఆహ్వానం’.. వచ్చిన అతిథులు మంచి నీరు సేవించేందుకు జొన్నపంట వ్యర్థాలతో తయారు చేసిన గ్లాస్‌లు.. ఆకులతో స్వీట్‌కప్పులు, కట్టె స్పూన్‌లు.. బాస్మతి బియ్యంతో బిర్యానీ, గో ఆధారిత వ్యవసాయం ద్వారా పండించిన దేశీ రకం చిట్టిముత్యాలతో పుదీనా రైస్, కుల్లకర్ బియ్యం, తామరపూల గింజల కూర్మా, దోసకాయ రోటీ పచ్చడి, మామిడికాయ పప్పు, పుట్టగొడుగుల కర్రీ, గుత్తి వంకాయ, మసాల కారం, సాంబారు, నవార రైస్‌తో పెరుగన్నం, మిర్యాల చారు వీటన్నింటిని తనివితీరా ఆరగించిన తరువాత స్వీట్లు, బెల్లం, మిర్యాలు, సోంప్‌తో తయారు చేసిన బెల్లం పానకం, కాజు, బాదాంలతో తయారు చేసిన ఆర్గానిక్ స్వీట్. వింటేనే నోరూరుతోంది.. తింటే ఆ సంతృప్తే వేరు. ప్రకృతి వంటకాలకు నగర శివారులోని ఓ ఫామ్‌హౌస్ వేదికైంది. నగరానికి చెందిన గణపత్రి విజయ్, కీర్తన దంపతులు తమ కుమార్తె సహస్ర నూతన వస్త్రాలంకరణ విందుకు 500 మంది అతిథులను ఆహ్వానించి వారందరికీ ప్రకృతి సిద్ధమైన భోజనం వడ్డించి ఆదర్శంగా నిలిచారు. పర్యావరణ ప్రేమికుడైన విజయ్ గానుగ నూనె వ్యాపారం చేస్తున్నారు.



కాజు, పిస్తాతో తయారుచేసిన ఆర్గానిక్ స్వీట్

చదువుకు పేదరికం అడ్డుకావొద్దు



మాట్లాడుతున్న జేటీసీ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్

- విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలి
- హైదరాబాద్ జేటీసీ చంద్రశేఖర్ గౌడ్

రుద్రూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలని హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్, రైడ్స్ గౌరవ అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ ఉద్బోధించారు. మండల కేంద్రంలో రుద్రూర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషనల్ సొసైటీ (రైడ్స్) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు నెల రోజులపాటు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రశేఖర్‌గౌడ్ మాట్లాడుతూ పేదరికం చదువుకోవడానికి అడ్డం కావొద్దని, అలాంటి వారికి రైడ్స్ చేయూత అందిస్తుందన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగులకు సహకారం అందిస్తుందని, అందుకు మామిండ్ల రామాగౌడ్ స్మారక ట్రస్ట్ తోడ్పాటునందిస్తుందని తెలిపారు. విశిష్ట అతిథిగా హాజరైన బోధన్ సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శేషతల్ప సాయి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైడ్స్ సభ్యుల ప్రోత్సాహాన్ని వినియోగించుకొని ప్రణాళికాబద్ధంగా చదవాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో రుద్రూర్, వర్ని ఎంఈవోలు కట్ట శ్రీనివాస్, డీ సాయిలు, సీనియర్ న్యాయవాది వెంకటేశ్వరరావ్ దేశాయ్, మాజీ సర్పంచ్ ఇందూర్ చంద్రశేఖర్, విండో మాజీ చైర్మన్ పత్తి రాము, ఇందూరు, వంశీ విద్యా సంస్థల అధినేతలు కిశోర్ కుమార్, పద్మజ, రైడ్స్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హిందూ సమాజం జాగృతం కావాలి


శ్రీమద్ భాగవత్ కథాకర్ దేవ్‌మూర్తి భగవత్‌చార్యతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రెంజల్(బోధన్): హిందూ సమాజం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో జాగృతం కావాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని కందకుర్తి త్రివేణి సంగమ క్షేత్రంలోగల సీతారాం ధామ్ త్యాగీ మహారాజ్ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించిన శతచండీ మహాయజ్ఞం, శ్రీమద్ భాగవత్ కథా పారాయణంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపనతో దేశ ప్రజల్లో భక్తిభావం, ఐక్యతను ప్రధాని మోదీ పెంపొందించారన్నారు. దేశం కోసం బీజేపీ చేస్తున్న ధర్మ పోరాటాలను వివరించారు. హిందూ ధర్మం గొప్పతనాన్ని వివరించారు. భగవత్ నామస్మరణలో యువత పాల్గొనాలని సూచించారు. సీతారాం త్యాగీ మహారాజ్, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి నడవడిక అలవర్చుకోవాలి



నిజామాబాద్‌రూరల్: విద్యార్థులు మంచి నడవడికను అలవరుచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. నగరంలో విద్యార్థులకు గత నెలలో రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయగా ఆదివారం ముగిసింది. ఈసందర్భంగా గంగాస్థాన్ ఫేజ్–2లోని రామకృష్ణ వివేకానంద ధ్యాన మందిరంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో హాజరై, మాట్లాడారు. రామకృష్ణ సేవా సమితి వేసవి శిక్షణ తరగతులు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. విద్యార్థులు శిక్షణతోపాటు మహనీయుల బోధనలను అనుసరించాలన్నారు. అనంతరం రెడ్‌క్రాస్‌లో జాతీయ అవార్డు గ్రహీత తోట రాజశేఖర్, ఉపాధ్యాయులను సత్కరించారు. శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సమితి ప్రతినిధులు, ఉపాధ్యాయులు సూర్య ప్రకాష్, సాయి ప్రసాద్, యోగా రాంచందర్, బొచ్చు గోపాల్, తోట రాజశేఖర్, వసంత్ పాటిల్, దీపక్, నాయక్, వినోద్, స్వరూప్, నర్సయ్య, గంగా ప్రసాద్, వినోద్, శ్రీనివాస్, శ్రీలేఖ, రమేష్, హనుమాండ్లు రాజేంద్రప్రసాద్, రాజ్‌కుమార్ సుబేదార్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



రుద్రూర్: పోతంగల్ మండలం సోంపూర్ గ్రామంలో ఆదివారం కుక్కల దాడిలో జింక మృతి చెందింది. సోంపూర్ శివారులోని వ్యవసాయ పొలాల్లో జింకను కుక్కలు వేటాడుతుండగా స్థానికులు తరిమేశారు. కాగా, అప్పటికే తీవ్రగాయాలపాలైన జింక మరణించింది. విషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు గ్రామానికి చేరుకొని పంచనామా చేశారు.

ప్రకృతి ప్రేమికుల విందు

నగర శివారులోని ఓ ఫామ్‌హౌస్‌లో నగరానికి చెందిన గణపత్రి విజయ్ ఆదివారం తన కూతురు సహస్రా వస్త్రాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. విందులో ప్రకృతి సిద్ధంగా పండించిన పంటలతో వివిధ రకాల వంటకాలు తయారు చేయించారు. 20 రకాల వంటకాలను అతిథులకు వడ్డించగా వారు సేంద్రియ పంటల రుచులను ఆస్వాదిస్తూ హర్షం వ్యక్తం చేశారు. నిర్వాహకులను అభినందించారు. ఈసందర్భంగా నిర్వాహకులు, అతిథులు తమ అభిప్రాయాలను ఇలా వ్యక్తం చేశారు. –నిజామాబాద్ రూరల్


అతిథులకు సేంద్రియ పంటలతో చేసిన వంటకాలను వడ్డిస్తున్న నిర్వాహకులు


భోజనం చేస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం



గణపత్రి విజయ్ కుమార్తె నూతన వస్త్రాలంకరణ మహోత్సవానికి ప్రకృతిసిద్ధ భోజనం వడ్డించడం ఎంతో ఆనందంగా ఉంది. సేంద్రియ పంటలతో వంటకాలు తినడంతో ప్రజల ఆరోగ్యాలు బాగుంటాయి. జీర్ణశక్తి మెరుగుపడి శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. –చింతలూరు చిన్నికృష్ణుడు, ప్రకృతి వ్యవసాయదారుడు

ఆర్గానిక్ ఆహారం ఎంతో మేలు



గతంలో మోపాల్ మండలం ఇందూరు తిరుమల మహోత్సవాల్లో ఐదు రోజుల పాటు వంటలు చేశాను. ప్రస్తుతం సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన పంటలతో చేయడం ఎంతో ఆనందంగా ఉంది. ఎలాంటి ఎరువులు, పురుగు మందులు వాడకుండ ప్రకృతి సిద్ధంగా ఆహారంను వండటం, అతిథులకు అందించడం ఎంతో శ్రేయస్కారం. –గాదే అశోక్‌రెడ్డి, వంట మాస్టర్

అతిథులు సంతృప్తి..



నా కుమార్తె వస్త్రాలంకరణ మహోత్సవం ఆదివారం నిర్వహించగా, వేడుకకు హాజరైన అతిథులు నాన్‌వెజ్ వంటకాలు ఉంటాయని అనుకున్నారు. కానీ నేను వారికి ప్రకృతి ద్వార పండిన వంటకాలను పెడుతున్నానని చెప్పాను. దీంతో వారు నిరుత్సాహం చెందారు. కానీ ఆర్గానిక్ వంటకాలను వడ్డించడంతో సంతృప్తి చెందారు. –గణపత్రి విజయ్, శుభకార్యం నిర్వాహకుడు

అందరు అలవాటు చేసుకోవాలి



రోజువారి నిత్యజీవితంలో ప్రతి మనిషి చిరుతిండ్లు తింటూ ఆరోగ్యాలను పాడుచేసుకుంటున్నారు. ప్రతిఒక్కరూ సేంద్రియ పద్ధతి ద్వారా సాగు చేసిన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యాలను కాపాడుకోవాలి. మా శుభకార్యంలో కొంతమంది అతిథులైనా సేంద్రియ పద్ధతి ద్వారా సాగుచేసిన ఆహారాన్ని తీసుకుంటారని ఈ వంటకాలను వడ్డించాం. – గణపత్రి కీర్తన, శుభకార్యం నిర్వాహకులు

ఆరోగ్యమే మహాభాగ్యం..



పెద్దలు ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. ప్రతి ఒక్కరూ బయట చిరు తిండ్లు తినడం మానేసి, సేంద్రియ పద్ధతి ద్వారా సాగుచేసిన ఆహారం తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి. భవిష్యత్ తరాలకు మంచి ఆరోగ్యాన్ని అందించి ఆదర్శంగా నిలవాలి. ప్రకృతి వంటకాలు అరుదుగా దొరుగుతాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాలి. –స్వప్న, శుభకార్యానికి విచ్చేసిన అతిథి

చాలా అరుదు..



ప్రకృతి ద్వారా పంటలు పండించే వారు అరుదుగా దొరుకుతారు. అందులో ఆ పంటలతో తయారుచేసిన ఆహారం తినడం అదృష్టం కావాలి. విటమిన్‌లతో పాటు సంపూర్ణ ఆరోగ్యం సేంద్రియ పద్ధతి ద్వారా పండించిన పంటల్లోనే లభిస్తుంది. దీనిని ప్రతిఒక్కరూ అందిపుచ్చుకోవాలి. –శ్వేత, శుభకార్యానికి విచ్చేసిన అతిథి

మేత కోసం రాష్ట్రం దాటి వచ్చి..


నవీపేట శివారులో పంట పొలాల్లో ఉన్న బాతులు

- బాతుల పెంపకంతో జీవనోపాధి పొందుతున్న సంచార కుటుంబాలు
- వాటి ఆహారం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా నుంచి నవీపేట్‌కు వచ్చిన పెంపకందారులు

నవీపేట: బాతుల పెంపకాన్ని జీవనోపాధిగా ఎంచుకున్న ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా పుంగనూరుకు చెందిన రెండు కుటుంబాలు నెల రోజుల కిందట నిజామాబాద్ జిల్లాకు వచ్చారు. వాహనంలో తీసుకువచ్చిన రెండువేల బాతులను నవీపేట శివారులోని పంటపొలాల్లో మేపుతున్నారు. కోతలు పూర్తయ్యాక పంట పొలాల్లో అక్కడక్కడ పడిన వరి గింజలతోపాటు కీటకాలను తిని బాతులు పొట్ట నింపుకుంటున్నాయి.

కోతలు పూర్తయిన చోటే..

బాయిలర్ కోళ్ల పెంపకం మాదిరి బాతుల పిల్లలను తమిళనాడు, కేరళలో పెంపకందారులు కొనుగోలు చేస్తారు. కొన్ని రోజులు కంటికి రెప్పలా చూసుకుని సంచారం వైపు పరుగులు తీస్తారు. పంట పొలాల్లోని గింజలను ఇష్టపడే బాతులకు పంట కోతలు పూర్తయ్యాక ప్రత్యేకంగా ఆ ప్రాంతాల్లో మేపుతారు. గింజలతోపాటు కీటకాలను తినడంతో అవి బలిష్ఠంగా తయారై బరువు పెరుగుతాయి. బాతులు కిలో నుంచి కిలోన్నర బరువు పెరగగానే వాటిని పశ్చిమ బెంగాల్, పంజాబ్‌తోపాటు కేరళలో విక్రయిస్తారు. ఒక్కో బాతును రూ. 300ల నుంచి రూ. 450ల వరకు విక్రయిస్తారు. వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటూ, ఆయా ప్రాంతాలు తిరుగుతూ బాతులను పెంచుతూ జీవనం సాగిస్తున్నారు.

ఆదాయం బాగుంది..



బాతుల పెంపకంతో ఆదాయం బాగుంటుంది. పంట కోతలకు ముందు చిన్న పిల్లలను కొనుగోలు చేస్తాం. కోతలు పూర్తయ్యాక పంట పొలాల్లో రాలిన గింజలను బాతులకు తినిపించేందుకు అక్కడక్కడ సంచరిస్తాం. పంట చేతికి వచ్చే రెండు నెలల ముందు ఇంటికి దూరంగా ఉంటాం. పంట పొలాల్లోనే గడుపుతాం. – హరి, పెంపకందారుడు, పుంగనూరు, చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్

పార్ట్‌టైం అధ్యాపకుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లా (నిజామాబాద్, కామారెడ్డి)లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల(బాలురు, బాలికలు)ల్లో ఉపాధ్యాయ, అధ్యాపకుల ఖాళీలను పార్ట్‌టైం ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా సమన్వయాధికారి మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్‌తో పాటు బీఈడీ కలిగి ఉండి కనీసం ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు అన్ని ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తులను డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో ఈనెల 26 నుంచి 28 వరకు సమర్పించాలన్నారు. బాలికల పాఠశాల/కళాశాలలకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని, అభ్యర్థులను మెరిట్, డెమో ప్రాతిపదికన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. డెమో తేదీలను అభ్యర్థులు ఇచ్చిన ఫోన్ నెంబర్లకు తెలియజేస్తామని పేర్కొన్నారు.

ఆత్మీయ పలకరింపులు.. మధుర స్మృతులు


బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1995-98 బీకాం బ్యాచ్ విద్యార్థులు



రెంజల్ జెడ్పీహెచ్‌ఎస్ 2008-09 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు


ముప్కాల్ జెడ్పీహెచ్‌ఎస్ 1999-2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు


అంకాపూర్‌లోని భార్గవి విద్యానికేతన్ పాఠశాల 1998-99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

- జిల్లాలో పలుచోట్ల సమ్మేళనాలు నిర్వహించిన పూర్వవిద్యార్థులు
- ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురైన చిన్ననాటి మిత్రులు

సాక్షి నెట్‌వర్క్: ఆత్మీయ పలకరింపులు.. ఆపాత మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు భావోద్వేగానికి లోనయ్యారు. అరే ఎన్నాళ్లయింది కలుసుకుని.. పూర్తిగా మారిపోయావంటూ ఆనాటి స్నేహితులు ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని వివిధ గ్రామాల ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పదోతరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నానాటి మిత్రులందరూ ఏళ్ల తర్వాత మళ్లీ ఒకే వేదికపై కలుసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ అనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకున్నారు. నాడు చదువు నేర్పిన ఉపాధ్యాయులను సమ్మేళనానికి ఆహ్వానించి, సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. అనంతరం విద్యార్థులు, గురువులు అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. అలాగే బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1995–98 మధ్య చదివిన బీకాం విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.


వన్నెల్(బి) జెడ్పీహెచ్‌ఎస్ 2004-05 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు


అంకాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ 2010-11 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు


కిసాన్‌నగర్ జెడ్పీహెచ్‌ఎస్ 1994-95 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు


మాక్లూర్ జెడ్పీహెచ్‌ఎస్ 2000-01 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు


శక్కర్‌నగర్ జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1992-95 వరకు చదివిన విద్యార్థులు

భర్త కొట్టడంతో భార్య మృతి

ఖలీల్‌వాడి: కుటుంబ కలహాల కారణంగా భర్త తన భార్యను కొట్టడంతో మృతిచెందిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన క్యాతరం నిఖిత(30)ను ఆదివారం భర్త నరేష్ కుటుంబ కలహాల కారణంగా కొట్టాడు. ఈ ఘటనలో ఆమె తీవ్రంగా గాయపడటంతో వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించారు. గాయాలతో నిఖిత మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు నాలుగోటౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

దాడి కేసులో ఒకరి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని వర్ని చౌరస్తా వద్ద గల ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఇటీవల ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు రెండో టౌన్ ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఇటీవల మాస్టర్ బిజయ్‌పై నవనాథ్ అనే వ్యక్తి కత్తితో దాడి చేయగా, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నవనాథ్‌ను జడ్జి ముందు హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతి



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కోటార్మూర్‌లో ఆదివారం విద్యుదాఘాతంతో నాలుగు గేదెలు మృతిచెందాయి. కోటార్మూర్‌లోని జనార్దన్ గౌడ్ అనే పాడి రైతుకు చెందిన నాలుగు గేదెలు ఆదివారం గ్రామ శివారులో మేతకు వెళ్లగా కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు వాటికి తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. సమాచారం అందుకున్న జిల్లా పశువైద్యాధికారి రోహిత్ రెడ్డి, మండల పశువైద్యాధికారి లక్కం ప్రభాకర్ ఘటన స్థలాన్ని సందర్శించారు. సుమారు రెండు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు జనార్దన్ గౌడ్ అధికారులకు తెలిపారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్లు రైతు ఆరోపించారు.

పోచారం తండాలో ఆవు..

పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండలంలోని పోచారం తండాలో కరెంట్ షాక్ తగిలి ఆవు మృతి చెందింది. పోచారం తండాలోని విఠల్ నాయక్ చెందిన ఆవు ఆదివారం మేతకు వెళ్లగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎలాంటి కంచె నిర్మించకపోవడం వల్లనే ఆవు మృతిచెందినట్లు స్థానికులు ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మరకు కంచె నిర్మించాలని, బాధితుడికి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

మద్యంమత్తులో వీరంగం

ఖలీల్‌వాడి: నగరంలో పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, ఓ వ్యక్తి మద్యం మత్తులో వీరంగం సృష్టించాడు. సదరు వ్యక్తి బ్రీత్ ఎనలైజ్ చేయడానికి యత్నించిన ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు గాయం అయింది. వివరాలు ఇలా.. నగరంలోని పాలిటెక్నిక్ వాటర్ ట్యాంక్ వద్ద ఆదివారం సాయంత్రం ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. నగరానికి చెందిన గౌతమ్ రెడ్డి మద్యం తాగి బైక్ నడుపుతుండగా పోలీసులు పట్టుకున్నారు. అనంతరం అతడికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేయడానికి ట్రాఫిక్ పోలీసులు యత్నించగా సహకరించలేదు. అసభ్య పదజాలంతో సిబ్బందిని దూషించాడు. ఆర్ఎస్సైలు సుమన్, వినోద్‌లు అతడిని సముదాయించినా, మత్తులో రోడ్డుపై పొర్లుతూ హంగామా చేశారు. బ్రీత్ ఎనలైజ్ చేయడానికి వెళ్లిన కానిస్టేబుల్ శేఖర్ బాబు కంటికి గాయం అయింది. దీంతో పోలీసులు మూడో టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ తెలిపారు.

హైవేపై ఢీకొన్న లారీలు



డిచ్‌పల్లి: మండలంలోని దేవుపల్లి క్యాంప్ గ్రామం సమీపంలోగల 44వ నెంబరు జాతీయ రహదారిపై ఆదివారం రెండు లారీలు ఢీకొన్నాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. హైదరాబాద్ వైపు నుంచి నాగ్‌పూర్ వైపు రెండు లారీలు బయలుదేరాయి. దేవుపల్లి క్యాంప్ సమీపంలో ముందున్న లారీని వెనుకున్న లారీ ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో రహదారిపై చాలా సేపు ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు, హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గురైన లారీలను క్రేన్ సాయంతో పక్కకు తొలగించి వాహన రాకపోకలను క్రమబద్ధీకరించారు. రెండు లారీలు ఢీకొన్న సమయంలో వాటిలో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన సమయంలో ఇతర వాహనాలు వాటిని ఢీకొన్నట్లయితే పెద్ద ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మొరం ట్రాక్టర్లు, పొక్లెయిన్ సీజ్



నిజాంసాగర్ (జుక్కల్): మండల కేంద్రం శివారులో మొరం తవ్వకాలు చేపడుతున్న పొక్లెయిన్‌ను, మొరం తరలిస్తున్న ట్రాక్టర్లను ఎస్సై శివకుమార్ ఆదివారం పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు చేపడుతూ, రవాణా చేయడంతో వాహనాలను సీజ్ చేసి, స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు.

మేకుఎన్ ఐడియా సర్‌జీ!

- కోతి చేష్టలకు మేకు విరుగుడు


బీబీపేటలో కోతులు రాకుండా డిష్ యాంటిన్నాకు కొట్టిన మేకులు

బీబీపేట(కామారెడ్డి): కోతులు తమ సహజమైన చేష్టలతో కిష్కింధకాండ సృష్టిస్తుంటాయి. పంటల నుంచి ఇళ్ల వరకు అన్నింటికి నష్టం చేకూరుస్తుంటాయి. వాటి బాధ తప్పించుకోవడానికి ప్రజలు రకరకాల ఏర్పాట్లు చేసుకుంటుంటారు. కోతుల బాధ తప్పించుకోవడానికి బీబీపేటకు చెందిన నర్సింలు కొత్త ఆలోచన చేశాడు. ఆయన ఇంటికి డీటీహెచ్ కనెక్షన్ ఉంది. కోతులు తరచూ డిష్ యాంటిన్నాపైకి దూకుతుండడంతో సెట్టింగ్ పోతోంది. దీంతో రిపేర్ చేయించడానికి వందలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయి. ఈ సమస్యనుంచి బయటపడడానికి నర్సింలు ఓ ఆలోచన చేశాడు. డిష్ యంటిన్నా చుట్టూ సైకిల్ సైకిల్ టైర్ చుట్టి మేకులు కొట్టాడు. సిగ్నల్ రిసీవర్ వద్ద కూడా ఇలాగే చేశాడు. డిష్ మధ్యలోనూ మేకులు కొట్టాడు. కోతులు దూకితే మేకులు గుచ్చుకునేలా వాటిని అమర్చాడు. ఇది సత్ఫలితాలు ఇస్తోంది. కోతులతోపాటు రిపేర్ల బాధ తప్పిందని నర్సింలు పేర్కొంటున్నాడు.

ఆలయాల్లో చోరీ

కమ్మర్‌పల్లి: మండలంలోని ఉప్లూర్ గ్రామంలోగల పెద్దమ్మ ఆలయం, పోచమ్మ ఆలయంలో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయాల తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. ఒక గ్రాము బంగారం, మూడు గ్రాముల వెండి ఆభరణాలు, హుండీలోని నగదును ఎత్తుకెళ్లారు. ముదిరాజ్ సంఘం ప్రతినిధి జెల్ల సదానంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై నరేందర్ తెలిపారు.

అలాగే ఉప్లూర్‌లోని పత్రి రవికి చెందిన బైక్ చోరీకి గురైంది. శనివారం రాత్రి రవి తన బైక్‌ను ఇంటి ముందర నిలిపి, ఇంట్లో నిద్రించాడు. అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు అతడి బైక్‌ను చోరీ చేశారు. అతడు ఉదయం లేచి చూసేసరికి బైక్ కనిపించకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికాడు. అయినా బైక్ ఆచూకీ లభించలేదు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని బాధితుడు తెలిపాడు.

కార్పెంటర్ షాపులో ఫారెస్ట్ అధికారుల దాడులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఓ కార్పెంటర్ దుకాణంలో ఆదివారం మధ్యాహ్నం అటవీశాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఫారెస్ట్ సెక్షన్ అధికారి ముబాషేరలి మాట్లాడుతూ.. మండలకేంద్రానికి చెందిన వడ్ల రాజశేఖర్ కార్పెంటర్ దుకాణంలో అక్రమంగా ఎనిమిది టేకు దుంగలను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం అతడికి రూ.8వేల జరిమానా విధించినట్లు తెలిపారు. కార్పెంటర్ షాప్ నిర్వాహకులపై కూడా వారం రోజుల్లో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని వివరించారు. మండలంలో ఎక్కడైనా ఫారెస్ట్ అధికారుల అనుమతి లేకుండా టేకు కలపతో పనులు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అక్రమంగా కలప వ్యాపారం జరిగినట్లు తెలిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. బీట్ ఆఫీసర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.